ఐదేళ్ల సహకారం గొప్ప విషయం

- ప్రజా శ్రేయస్సు కోసం పనిచేయడం అభినందనీయం
- ప్రజాప్రతినిధుల సన్మానంలో జడ్పీ చైర్మన్ కమల్‌రాజు

మధిర రూరల్, జనవరి 20: గ్రామాల అభివృద్ధి, అభ్యున్నతి కోసం ఐదేళ్లు సేవ చేయడం, సహచర ప్రజాప్రతినిధులకు, అధికారులకు సహకరించడం గొప్ప విషయమని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారందరూ తమ పదవీ కాలంలో ప్రజల శ్రేయస్సు కోసం అహర్నిశలూ పనిచేశారని కొనియాడారు. మండలంలోని సర్పంచులు, వార్డు సభ్యుల పదవీకాలం ఈ నెల 31తో ముగియనున్నందున స్థానిక మండల పరిషత్ సమావేశంలో మందిరంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో వారితోపాటు ఎంపీటీలను కూడా జడ్పీ చైర్మన్ సన్మానించారు. ఎంపీపీ మెండెం లలిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులుగా ఎన్నికై ఐదేళ్ల పాటు ప్రజలకు విశేష సేవలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఎంపీడీవో సిలార్‌సాహేబ్, ఎంసీఆర్డీవో శాస్త్రి, సర్పంచ్‌లు కనకపుడి పెద్దబుచ్చయ్య, మందడపు ఉపేందర్, మదార్‌సాహెబ్, బొగ్గుల పద్మావతి, ధీరావత్ లక్ష్మి, మోరబోయిన నాగమణి, బుర్రు సునీత, నాగేశ్వరరావు, అడపాల వెంకటేశ్వర్లు, కటికల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.


స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న జడ్పీ చైర్మన్ కమల్‌రాజు

భోజనం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సహకారం..

కల్లూరు, జనవరి 20: కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల 1997-1999 బ్యాచ్ విద్యార్థులు.. అపూర్వ సహకారానికి శ్రీకారం చుట్టారు. ఈ కళాశాల ఇప్పటి విద్యార్థులకు వార్షిక పరీక్షలు పూర్తయ్యేంత వరకు మధ్యాహ్న భోజనం అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ కుతుంబాక శ్రీనివాసరావు, దాతలతో కలిసి శనివారం ప్రారంభించారు. పూర్వ విద్యార్థులు కృష్ణారావు, చందర్‌రావు, భాస్కర్, వెంకటేశ్వరరావు, కృష్ణారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం: ఎంవీఐ

అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ వెంకటపుల్లయ్య

సత్తుపల్లి, జనవరి 20: రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) సంగం వెంకటపుల్లయ్య అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని కాకర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు శనివారం అవగాహన కల్పించారు. రోడ్డు నిబంధనలు పాటించని ఫలితంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రాణాలు పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్/సీట్ బెల్ట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహన పత్రాలు దగ్గర ఉంచుకోవాలని కోరారు. హెచ్ఎం ఎన్.రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడిసె రాజశేఖర్‌కు 'అమిటీ వర్సిటీ' గోల్డ్‌మెడల్

గోల్డ్ మెడల్ అందుకుంటున్న గుడిసె రాజశేఖర్

ఖమ్మం రూరల్, జనవరి 20: మండలంలోని కాచిరాజుగూడేనికి లెనిన్ శ్రీనివాస్ తనయుడు యువ కవి, కథకుడు గుడిసె రాజశేఖర్ శనివారం గోల్డ్ మెడల్ అందుకున్నారు. రాజస్థాన్‌లోని అమిటీ విశ్వవిద్యాలయంలో రాజశేఖర్ మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి.. చదువు, సాహిత్యం, సామాజిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరుస్తున్నాడు. తాజాగా జరిగిన స్నాతకోత్సవంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సెలర్ డాక్టర్ అసీం చౌహాన్, క్యాంపస్ వైస్ చాన్సెలర్ అమిత్ జైన్, హెచ్‌వోడీ మంగల్‌సింగ్ సిసోడియా, హెడ్ పంకజ్‌పాండే, రిషి దేవంగన్, దీపక్ పటోచ్ తదితరులు రాజశేఖర్‌కు గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు.

నేడు నేలకొండపల్లిలో ఆరోగ్య సమ్మేళనం

కూసుమంచి (నేలకొండపల్లి), జనవరి 20: సిద్ధార్థ యోగా విద్యాలయం ఏర్పడి 24 ఏళ్లు అవుతున్న సందర్భంగా నేలకొండపల్లిలోని బౌద్ధస్తూపం వద్ద ఆదివారం 'ఆరోగ్య సమ్మేళనం' ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు డాక్టర్ ఆర్.రామచందర్ రావు శనివారం తెలిపారు. ఆరు రాష్ట్రాల ప్రతినిధులు, ఇతర దేశాల ప్రముఖులు హాజరవుతారని చెప్పారు. 100 రకాల దేశవాళి బియ్యంతోపాటు, కూరగాయ విత్తనాలు, మగ్గం మట్టి కుండలు, పురాతన మల్కం గేమ్ వంటి ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

తమ్మినేనికి మాజీ మంత్రి పువ్వాడ పరామర్శ

ఖమ్మం, జనవరి 24: హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం పరామర్శించారు. తమ్మినేనికి అందిస్తున్న వైద్య వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని పూర్తి ఆరోగ్యవంతుడై రావాలని పువ్వాడ ఆకాంక్షించారు.

9999@రూ.11,11,199

వాహన ఫ్యాన్సీ నెంబర్ కోసం అధిక ధర వెచ్చించిన వినియోగదారుడు

రఘునాథపాలెం, జనవరి 19: ఫ్యాన్సీ నెంబర్లకు క్రేజ్ పెరిగిపోయింది. ఫ్యాన్సీ నెంబర్లను వాహనాలకు పెట్టుకోవడం హుందాగా భావిస్తున్నారు. ఇందుకోసం పోటీపడుతున్నారు. గురువారం ఖమ్మం ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో 9999 నెంబర్ అత్యధిక ధరకు అమ్ముడుపోయింది. టీఎస్ 04 ఎఫ్‌కే సిరీస్‌లో నడుస్తున్న 9999 నెంబర్‌కు పోటీరావడంతో అధికారులు వేలం నిర్వహించారు. ఈ వేలంలో ఖమ్మం నగరానికి చెందిన మందాడ శ్రీనివాసరావు ఆన్‌లైన్ ద్వారా రూ.11,11,199 దక్కించుకున్నాడు. దీంతో శనివారం ఒక్కరోజు ఫ్యాన్సీ నెంబర్ల ద్వారా ఖమ్మం రవాణా శాఖకు రూ.12,49,585 ఆదాయం వచ్చిందని డీటీవో మహ్మద్ గౌస్‌పాషా తెలిపారు.

ఓటు నమోదుకు స్పెషల్ డ్రైవ్

- జిల్లాలోని అర్హులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి
- ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల పరిశీలనలో కలెక్టర్ వీపీ గౌతమ్
- సత్తుపల్లి, వేంసూరు, చింతకాని, బోనకల్లుల్లో ఆర్డీవోల పర్యటన

బీఎల్‌వోలకు సూచనలు చేస్తున్న కలెక్టర్, కేఎంసీ కమిషనర్

రఘునాథపాలెం, జనవరి 19: ఫొటో ఎలక్టోరల్ రోల్ స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా శని, ఆదివారాల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. శనివారం ఆయన రోటరీనగర్ జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కమిషనర్ ఆదర్శ్ సురభి, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ స్వామి పాల్గొన్నారు.

చింతకాని, బోనకల్లులో..

చింతకాని/ బోనకల్లు, జనవరి 20: ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు, సాధారణ ఓటరు నమోదు, సవరణను సద్వినియోగించుకోవాలని ఖమ్మం ఆర్డీవో గణేశ్ అన్నారు. చింతకాని మండలం నాగులవంచ పోలింగ్ కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. కాగా, బోనకల్లు మండలం ముష్టికుంట్ల, రావినూతల, కలకోట గ్రామాల్లో ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలను శనివారం ఆయన పరిశీలించారు.

సత్తుపల్లిలో..

సత్తుపల్లి, జనవరి 20: అర్హులైన పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదు చేసుకోవాలని కల్లూరు ఆర్డీవో అశోకచక్రవర్తి కోరారు. పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన సందర్శించి ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించారు.

వసుంధర జ్యూయలర్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ఆభరణాల ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సందర్శకులు

మామిళ్లగూడెం, జనవరి 20: హైదరాబాద్‌కు చెందిన వసుంధర డైమండ్ జ్యూయలర్స్ ఆధ్వర్యంలో నగరంలోని హోటల్ గ్రాండ్ గాయత్రిలో డైమండ్, బంగారు ఆభరణాల అమ్మకం, ప్రదర్శన నిర్వహించారు. శనివారం నిర్వహించిన ప్రదర్శనలో వినియోగదారులకు ఈఎమ్ఐ సౌకర్యంతో అమ్మకాలు చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ ఏజీఎం జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ఈ అవకాశం రెండ్రోజులు మాత్రమే ఉంటుందని తెలిపారు. గత 25ఏళ్లుగా వసుంధర జ్యూయలర్స్ సంస్థ నాణ్యత గల బంగారు, డైమండ్ నగల అమ్మకాలతో కస్టమర్ల ఆదరాభిమానాలు పొందుతూ తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మందికి నమ్మకమైన వ్యాపార సేవలను అందిస్తున్నట్లు వివరించారు. ఖమ్మం నగరంలో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌ను ఖమ్మం జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంస్థ సిబ్బంది మహేందర్, ఖాజా పాల్గొన్నారు.

'హ్యూండాయ్ న్యూ క్రేటా' కారు విడుదల

హ్యూండాయ్ న్యూ క్రేటా కారును ఆవిష్కరిస్తున్న అధికారులు

రఘునాథపాలెం, జనవరి 20: మారుతున్న సాంకేతికతను జోడించి సరికొత్త వాహనాల తయారీ దిగ్గజ సంస్థ భారత్ హ్యూండాయ్ మార్కెట్‌లోకి న్యూ వేరియంట్ కారును తీసుకొచ్చింది. ఎస్‌యూవీ మోడల్‌లో హ్యూండాయ్ న్యూ క్రేటాను కస్టమర్లకు పరిచయం చేసింది. ఈ మేరకు నూతన కారు ఆవిష్కరణ కార్యక్రమం శనివారం శ్రీశ్రీ సర్కిల్‌లోని భారత్ హ్యూండాయ్ షోరూంలో జరిగింది. డీటీవో మహ్మద్ గౌస్‌పాషా ముఖ్యఅతిథిగా హాజరై కారును విడుదల చేశారు. ఈ సందర్భంగా నూతన మోడల్ కారు విశిష్టతలను షోరూం సీఈవో సీహెచ్ శయన కృష్ణ వివరించారు. భారత్ హ్యూండాయ్ గ్రూప్ చైర్మన్ కేశా సుభాశ్‌చంద్రబోస్, ఎస్‌బీఐ ఆర్ఎం విజయ్‌కుమార్, యూబీఐ డీజీఎం హనుమంత రెడ్డి, ఎంవీఐ వరప్రసాద్, ప్రముఖ యూట్యూబర్ రంగబాబు పాల్గొన్నారు.

పకడ్బందీగా సిటీ పోలీస్ యాక్ట్: సీపీ

మాట్లాడుతున్న సీపీ సునీల్

మామిళ్లగూడెం, జనవరి 20: జిల్లాలో సిటీ పోలీస్ యాక్ట్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నామని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 104 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని, బహిరంగ మద్యపానం, పబ్లిక్ న్యూసెన్స్, రాష్ డ్రైవింగ్, రాత్రి వేళ సమయానికి మించి షాపులు తెరవడం, పని లేకున్నా రోడ్లపైకి రావడం, బర్త్‌డేల పేరుతో నడి రోడ్డుపై వాహనాలు అడ్డంపెట్టి ప్రజలకు అసౌకర్యం కలిగించే వారిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. అటువంటి వారికి జరిమానా, జైలు రెండూ పడే అవకాశాలు ఉన్నాయన్నారు.

హోంగార్డుకు సన్మానం

ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు బీ.కృష్ణయ్యను సీపీ సునీల్‌దత్ సన్మానించారు. శనివారం ఆయన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ కృష్ణయ్య సుదీర్ఘకాలం వివిధ విభాగాల్లో విధులు నిర్వహించి అధికారుల మన్ననలు పొందారని కొనియాడారు. ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఏఆర్ ఏసీపీ నర్సయ్య, హోంగార్డ్ ఆర్ఐ సురేశ్, హెడ్ కానిస్టేబుల్ దత్తురామ్, ఖమ్మం జిల్లా హోంగార్డ్ ఆఫీసర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, ఆలీ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

వైరా టౌన్, జనవరి 20: వైరాలోని రాజశేఖర్ నగర్‌కు చెందిన వాడపల్లి దివ్యచంద్రిక బీటెక్ పూర్తి చేసి, ఉద్యోగ ప్రయత్నాలు సాగిస్తున్నది. ఆమెకు ఉపయోగపడేలా ల్యాప్‌టాప్‌ను వైరా లయన్స్ క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్-2 నంబూరు మధు, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ బుధవారం అందించారు. క్లబ్ అధ్యక్షుడు పెనుగొండ ఉపేంద్రరావు అధ్యక్షతన స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు పాల్గొన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు

ఖమ్మం రూరల్, జనవరి 20: మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ)కు ఐఎస్‌వో గుర్తింపు లభించింది. ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్‌వో) గుర్తింపు పత్రాన్ని సంస్థ బాధ్యులు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఝాన్సీరాణిని, అధ్యాపకులను ఖమ్మం ఆర్‌సీవో ప్రత్యూష అభినందించారు.

ఎరువుల వివరాలను ఆన్‌లైన్ చేయాలి: ఏవో

బోనకల్లు, జనవరి 20: మండలంలోని ఎరువులు విక్రయించే డీలర్లు, సహకార సంఘాల బాధ్యులు తమ వద్ద ఉన్న ఎరువుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని ఏవో సరిత సూచించారు. డీలర్లు, సహకార సంఘాల కార్యదర్శులతో బోనకల్లు రైతువేదికలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఎరువులు అందించాలని, స్టాక్ వివరాలను పీవోఎస్ ద్వారా తెలియజేయాలని సూచించారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికల వారోత్సవాలు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 20: జాతీయ బాలికల వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఖమ్మంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా సాధికారిత కేంద్రం, మెడికల్ కళాశాల ఏఎన్ఎం ట్రైనింగ్ సెంటర్లలో డీడబ్ల్యూవో సుమ మాట్లాడుతూ ఈ నెల 24 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రఘునాథపాలెం మండలం రాజ్యాతండా గ్రామసభలో బేటీ బచావో, బేటీ పడావోపై అవగాహన కల్పించారు.

జిల్లా స్థాయి క్రికెట్ విజేత గన్యాతండా

కూసుమంచి, జనవరి 20: మండలంలోని జక్కేపల్లిలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో గన్యాతండా జట్టు విజేతగా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గన్యాతండా, జక్కేపల్లి, పెరికసింగారం ఎస్సీ కాలనీ జట్టు తలపడగా గన్యాతండా విజేతగా నిలిచింది. పెద్ద కృష్ణారెడ్డి, కొత్తా ఎల్లారెడ్డి మెనేజ్‌మెంట్‌కు టీ షర్టులు అందజేశారు. క్రీడా పోటీలల్లో విజేతలకు నగదు బహుమతితోపాటు ట్రోఫీని అందజేశారు.

ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్

మామిళ్లగూడెం, జనవరి 20: తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం 2024 క్యాలెండర్‌ను కలెక్టర్ వీపీ గౌతమ్ శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌తో కలిసి ఆవిష్కరించారు. సంఘం బాధ్యులు వెంకన్న, బిక్కు, కోడి లింగయ్య పాల్గొన్నారు.

గణిత పోటీల్లో మెరిసిన హార్వెస్ట్ విద్యార్థులు

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 20: నగరంలోని హార్వెస్ట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆదిత్య బిర్లా వరల్డ్ అకాడమీ , బిట్స్ పిలానీ నిర్వహించిన గణితశాస్త్ర పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి శనివారం తెలిపారు. 16 దేశాల నుంచి 520 టీమ్‌లు పాల్గొనగా, సౌత్ ఇండియా నుంచి 10 టీమ్‌లు ఎంపికైనట్లు పేర్కొన్నారు. చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబర్చిన హర్షిత్, పన్విక్, శ్రీకర్‌రెడ్డిని కరస్పాండెంట్ పోపూరి రవిమారుత్ అభినందించారు.

చికిత్స పొందుతూ మాజీ సర్పంచ్ మృతి

కూసుమంచి, జనవరి 20: కూసుమంచి మాజీ సర్పంచ్ జర్పుల మూన్యానాయక్ (60) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ధార్మతండాకు చెందిన మూన్యానాయక్ మూడేళ్లుగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురి కాగా కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: డీటీవో

గులాబీ పూలు అందించి అవగాహన కల్పిస్తున్న డీటీవో

రఘునాథపాలెం, జనవరి 19: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించి రోడ్డు ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని ఖమ్మం జిల్లా రవాణాశాఖ అధికారి మహ్మద్ గౌస్‌పాషా కోరారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం ఖమ్మం ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయం ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు వాహనం నడిపే సమయంలో తప్పక హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటు బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమన్నారు. ఈ సందర్భంగా బైపాస్ రోడ్డులో వెళ్లే వాహనదారులను ఆపి గులాబీ పువ్వులను అందించి రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్‌లో తమపై ఆధారపడిన కుటుంబ సభ్యులను గుర్తుచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు శంకర్‌నాయక్, వరప్రసాద్, రవాణాశాఖ కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

కూసుమంచి, జనవరి 20: మండలంలోని పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు ఉమ్మడి జిల్లా నుంచి 3,140 మంది దరఖాస్తు చేసుకోగా 2,492 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ కే.శ్రీనివాసులు తెలిపారు. డీఈవో సోమశేఖరశర్మ పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. మొత్తం 19 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 79.33 శాతం విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు.

మధిరలో 39 మంది గైర్హాజరు

మధిర, జనవరి 20: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి అడ్మిషన్ కోసం మధిరలోని టీవీఎం పాఠశాలలో శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 130 మంది హాజరై, 39 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో వై.ప్రభాకర్ తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో మండల విద్యార్థిని ప్రతిభ

విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముదిగొండ, జనవరి 20: మండలంలోని మేడేపల్లి హైస్కూల్ విద్యార్థిని మహేశ్వరి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చింది. ఈ నెల 16 నుంచి 18 వరకు హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌లో జిల్లా జట్టు కాంస్య పతకం సాధించినట్లు పీఈటీ కృష్ణయ్య శనివారం తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన మహేశ్వరిని ఉపాధ్యాయులు అభినందించారు.

సంక్షిప్తం

29న ఎస్ఎంసీ ఎన్నికలు

కల్లూరు, జనవరి 20: ఈ నెల 29న మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను చేతులెత్తే పద్ధతిన నిర్వహించనున్నట్లు ఎంఈవో దామోదర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 20న తల్లిదండ్రుల జాబితా ప్రకటన, 22న అభ్యంతరాల స్వీకరణ, 24న తుది జాబితా ప్రకటన ఉంటుందని వివరించారు.

నేడు 'విద్యుత్' అంతరాయం

వైరా టౌన్, జనవరి 20: వైరా టౌన్ వన్ ఫీడర్ పరిధిలో ఆదివారం ఉదయం 7:30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆ శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

'సైబర్'పై అప్రమత్తంగా ఉండాలి

కల్లూరు, జనవరి 20: సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని కల్లూరు రూరల్ సీఐ హనోక్ కోరారు. ఆయన శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు.

'మోడల్' దరఖాస్తు ఆహ్వానం

పెనుబల్లి, జనవరి 20: పెనుబల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 6, 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 22లోగా https://telanganams.cgg.gov.in/ లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

నేడు ఓటరు నమోదు, సవరణ

పెనుబల్లి, జనవరి 20: ఓటరు నమోదు, జాబితాలో సవరణలకు ఆదివారం ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ గంటా ప్రతాప్ శనివారం తెలిపారు. బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

నిరుపేదలకు చీరలు పంపిణీ

వైరా టౌన్, జనవరి 20: నిరుపేద మహిళలకు చీరలను విశిష్ట ఫౌండేషన్ నిర్వాహకులు గుర్రం సీతాకుమారి, గుర్రం సుమతి పంపిణీ చేశారు. వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సమావేశం

వైరా టౌన్, జనవరి 20: ఎస్ఎంసీ ఎన్నికల సందర్భంగా స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశాన్ని ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వరి, నాగబత్తిన స్వప్న శనివారం నిర్వహించారు.

వృద్ధులకు రగ్గులు పంపిణీ

వేంసూరు, జనవరి 20: మండలంలోని మర్లపాడు గ్రామంలో వృద్ధులకు రగ్గులను జీవీఎం ట్రస్ట్ చైర్మన్ గండ్ర సోమిరెడ్డి-జయ దంపతులు శనివారం పంపిణీ చేశారు. డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పలువురిపై చీటింగ్ కేసులు

మామిళ్లగూడెం, జనవరి 20: ఉద్దేశపూర్వకంగా నంబర్‌ప్లేట్‌లో ఉన్న లెటర్స్‌ను తొలగించి నగరంలో చక్కర్లు కొడుతున్న పలువురు వాహనదారులపై శనివారం చీటింగ్ కేసులను నమోదు చేసినట్లు ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణి తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నెంబరు లేకుండా, ట్యాంపరింగ్ చేసిన, రిజిస్టర్ లేని వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

డీఎస్‌వోను కలిసిన రేషన్‌డీలర్లు

రఘునాథపాలెం, జనవరి 19: జిల్లా సివిల్ సప్లయీస్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కె.చందన్‌కుమార్‌ను శనివారం ఖమ్మం నగర రేషన్ డీలర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నగర అధ్యక్షుడు ఇబ్రహీం, బాబు, సంతోశ్ ఉన్నారు.

అయోధ్యకు ప్రత్యేక రైళ్లు

పెద్దపల్లి, జనవరి 20 (నమస్తే తెలంగాణ): అయోధ్య రామమందిరం ప్రారంభం, విగ్రహ ప్రాణప్రతిష్ఠా మహోత్సవం ఈ నెల 22న జరుగనుండగా.. అందుకోసం రైల్వే శాఖ తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నది. ఈ నెల 29 నుంచి మార్చి 3 వరకు అయోధ్యా ధాం రైల్వే జంక్షన్‌కు స్పెషల్ సర్వీసులు నడపాలని నిర్ణయించింది.

కాజీపేట జంక్షన్ పరిధిలో..

కాజీపేట నుంచి అయోధ్యా ధాం జంక్షన్ రైల్వే స్టేషన్‌కు రైలు నంబర్ 07223 ద్వారా ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 28 వరకు వారంలో మూడు రోజులు ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. జనవరి 30, ఫిబ్రవరి 1, 3, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28 తేదీల్లో కాజీపేట జంక్షన్ నుంచి సాయంత్రం 06:20 గంటలకు ఇవి బయలుదేరుతాయి. అలాగే, అయోధ్య జంక్షన్ నుంచి ఫిబ్రవరి 2, 4, 6, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29 తేదీల్లో, మార్చి 2న ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఇవి అయోధ్య నుంచి మధ్యాహ్నం 2:20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 9 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటాయి.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **ఖమ్మం బ్